క్లుప్తంగా

'డిజిటల్ బుక్' క్యూఆర్ కోడ్ ఆవిష్కరణ



కోనేరు సెంటర్: మచిలీపట్నంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి(కిట్టు) మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్యకర్తల కోసం ప్రవేశ పెట్టిన 'డిజిటల్ బుక్' క్యూ ఆర్ కోడ్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన డిజిటల్ బుక్ ప్రయోజనాలను కార్యకర్తలకు వివరించారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు మేకల సుధాకర్‌బాబు, మాజీ డిప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, ఇతర నాయకులు చిటికిన నాగేశ్వరరావు, గూడవల్లి నాగరాజు, పల్లి శేఖర్, అజ్గర్‌అలీ, గాజుల భగవాన్, శ్రీరామ్ చిన్నా, కాగిత జవహర్, ప్రసాద్, బూరగ రామారావు, రఫీ తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత



పెడన: జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న సమయంలో మరణించిన అనగాని కంచయ్యకు బీమా కింద రూ.2 లక్షలు మంజూరయ్యాయి. ఈ చెక్కును సోమవారం మడక పంచాయతీ కార్యాలయం వద్ద కంచయ్య కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో అరుణకుమారి, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఎం వజీర్ అహ్మద్, టీడీపీ మండల కార్యదర్శి శీరం ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రతి సమస్యకు పరిష్కారం



కోనేరు సెంటర్: మీకోసంలో అందించిన ప్రతి అర్జీని పరిష్కరించనున్నట్లు జిల్లా అడిషనల్ ఎస్పీ వీవీ నాయుడు తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని స్పందన హాలులో జరిగిన మీకోసం కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి అర్జీలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ.. తన దృష్టికి వచ్చిన ప్రతి అర్జీని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కార చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. మీకోసంలో 38 అర్జీలు అందినట్లు ఆయన తెలిపారు.

నదీ మార్గాల్లో రాకపోకలు బంద్



చల్లపల్లి: కృష్ణానదిలో వరద నీరు పెరుగుతున్న దృష్ట్యా మండల పరిధిలోని ఆముదార్లంక, నడకుదురు, నిమ్మగడ్డ, రాముడుపాలెం ప్రాంతాల్లో నదిలోకి వెళ్లే మార్గాలను సోమవారం మూసివేసినట్లు చల్లపల్లి ఎస్‌ఐ పీఎస్‌వీ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఎవరూ అటువైపు వెళ్లకుండా పోలీసు, రెవెన్యూ సిబ్బందిని నియమించినట్లు చెప్పారు. నదిలో వరద తగ్గే వరకూ ప్రజలు సహకరించాలని ఎస్‌ఐ కోరారు.

అధికారులపై కౌన్సిల్ సభ్యుల తీవ్ర ఆగ్రహం



పెడన: అధికారులు తమ పనిని సక్రమంగా చేయడం లేదని.. ఇదే పరిస్థితి నెలకొంటే తీవ్ర పరిస్థితులు ఎదుర్కోవాల్సి ఉంటుందని కౌన్సిల్ సభ్యులు తీవ్ర స్థాయిలో మున్సిపల్ అధికారులపై మండిపడ్డారు. సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి అధ్యక్షతన కౌన్సిల్ హాలులో కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. అజెండాలోని పలు అంశాలపై చర్చ జరిపారు. ఎంఎస్‌ఎంఈ(మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్) డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పట్టణంలో కామన్ ఫెసిలిటీ సెంటరు ఏర్పాటు చేసేందుకు మున్సిపాలిటీ స్థలాలున్నాయని.. వాటిని ఇవ్వాలని చేర్చిన అజెండాలోని అంశాన్ని సభ్యులు ఏకగ్రీవంగా తిరస్కరించారు. అది ప్రైవేటు సంస్థ అని, ఇప్పటికే మున్సిపాలిటీకి ఆదాయం లేక అల్లాడుతుందని, ఉన్న ఆస్తులు కూడా ఇచ్చేస్తే మున్సిపాలిటీ కుంటుపడుతుందని మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎండీ ఖాజా అన్నారు. కామన్ ఫెసిలిటీ సెంటరుకు స్థలాలు కేటాయించాల్సిందేనని 12వ వార్డు కౌన్సిలర్(జనసేన)శివపావని పట్టుబట్టారు. పట్టణంలో హిందూ శ్మశానవాటిక ఎవరి ఆధీనంలో ఉందని.. దానిని పర్యవేక్షించాల్సిన బాధ్యత ఎవరిదని సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్ టీపీవో సుజనకుమారిని చైర్‌పర్సన్ ద్వారా ప్రశ్నించారు. సమావేశంలో సీనియర్ కౌన్సిలర్ మెట్ల గోపీ, మున్సిపల్ కమిషనర్ ఎల్ చంద్రశేఖర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ బైలపాటి జ్యోతి, కౌన్సిల్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.



బుట్టాయిపేట దత్తాశ్రమంలో సరస్వతీ దేవి



గణపేశ్వరంలో సరస్వతీ దేవిగా దుర్గాదేవి



గూడూరులో శ్రీ సరస్వతీ దేవి



అడ్డపర్ర కనకదుర్గమ్మ ఆలయంలో..



వీణాపాణిగా కోడూరు గంగాభవానీ



సరస్వతీ దేవిగా విశ్వనాథపల్లి నాంచారమ్మ

హంస వాహిని.. విద్యా రూపిణీ

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. జగజ్జననీ.. జగదాంబికా అయిన లోకనాయకి సోమవారం దవళ వస్త్రాలు, అక్షయ వీణ, అక్షరమాల, పుస్తకం ధరించి హంస వాహనంపై సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయాల్లో చిన్నారులు ప్రత్యేక పూజలను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. విద్యా బుద్ధులు ప్రసాదించమని తల్లి ముందు ప్రణమిల్లారు. విద్యా రూపిణీ, జ్ఞాన ప్రదాయిని అయిన జననిని దర్శించడానికి భక్తులు ఆలయాల ముందు బారులు తీరారు.

- సరస్వతీ దేవిగా అమ్మవారి దర్శనం
- మూలా నక్షత్రం సందర్భంగా ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- నేడు జగన్మాతకు దుర్గాష్టమి పూజలు

మచిలీపట్నం టౌన్: మూలా నక్షత్రం కావడంతో సోమవారం నగరంలోని అమ్మవారి ఆలయాల్లో విద్యార్థులు సరస్వతీ పూజలు నిర్వహించారు. బుట్టాయిపేటలోని దత్తాశ్రమంలో అమ్మవారు శ్రీ సరస్వతీ దేవిగా దర్శనమిచ్చారు. విద్యార్థులతో సామూహిక సరస్వతీ పూజ నిర్వహించారు. కార్యక్రమాలను దత్తాశ్రమం నిర్వాహక కమిటీ ప్రతినిధి శ్రీనివాస్ పర్యవేక్షించారు.

గణపేశ్వరం(నాగాయలంక): స్థానిక శ్రీదుర్గా శ్రీగణపేశ్వర స్వామి ఆలయాల్లో దుర్గమ్మను సరస్వతీ మాతగా అలంకరించారు. కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్త మండల శ్రీరామ చంద్రమూర్తి(రాంబాబు)–అరుణ దంపతులు, ఈవో సీహెచ్ సుధాకర రావు, అర్చకులు పోతుకూచి సత్యనారాయణ శాస్త్రి పాల్గొన్నారు. నాగాయలంకలో తలశిల వారి ఇలవేల్పు గంగానమ్మ తల్లిని రూ.4 లక్షల కరెన్సీ నోట్లతో అలంకరించారు.

సరస్వతీ దేవిగా బాలత్రిపుర సుందరీ..

చల్లపల్లి: మండల పరిధిలోని నడకుదురులో కొలువైన శ్రీబాలత్రిపుర సుందరీ సమేత శ్రీపృథ్వీశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. చల్లపల్లి ఎస్‌ఐ పీఎస్‌వీ సుబ్రహ్మణ్యం కుటుంబ సమేతంగా విచ్చేసి పూజలు జరిపించారు. అనంతరి ఎస్‌ఐ చేతుల మీదుగా విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు.

సరస్వతీ పూజలో చిన్నారులు..

నాగాయలంక: స్థానిక శ్రీపార్వతీ సమేత కన్యకాపరమేశ్వరీ సమన్విత శ్రీనగరేశ్వరస్వామి దేవస్థానంలో నాగాయలంక, పరిసర గ్రామాలకు చెందిన చిన్నారులతో సామూహిక సరస్వతీ పూజను నిర్వహించారు. స్థానిక డీసీ చైర్మన్ బండ్రెడ్డి చినబాబు–శివకుమారి దంపతులు బాలల సామూహిక పూజా కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం చిన్నారులకు పుస్తకాలు.. దాతల వితరణతో అన్నప్రసాద చేశారు. శ్రీరామపాదక్షేత్రం ప్రాంగణంలోని కనకదుర్గమ్మ దేవాలయంలో విద్యార్థులు సామూహిక సరస్వతీ పూజలో ఉత్సాహంగా పాల్గొన్నారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఆయన సతీమణి విజయలక్ష్మి కుటుంబ సభ్యులతో కలసి దుర్గమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు.

సామూహిక కుంకుమార్చనల్లో మహిళలు..

కోడూరు: కోడూరు గంగాభవానీ అమ్మవారిని చదువుల తల్లిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. విద్యార్థులు అమ్మవారికి సామూహిక కుంకుమార్చనను భక్తిప్రపత్తులతో జరిపారు. సంత మార్కెట్ సమీపంలోని కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో చిన్నారులకు పలకలు, పుస్తకాలు అందించి అక్షరాభ్యాసాలను నిర్వహించారు.

పెడన: పెడన పట్టణంలోని కన్యకా పరమేశ్వరీ ఆలయం, పైడమ్మ ఆలయం, ముత్యాలమ్మ ఆలయంతో పాటు మండలంలోని పలు ఆలయాల్లో విద్యార్థులతో సామూహిక సరస్వతీ పూజలను చేయించారు. ఆయా ఆలయాల కార్యక్రమాలను కమిటీలు పర్యవేక్షించారు.

కృత్తివెన్ను: మండలంలోని అడ్డపర్ర, నీలిపూడి, గరిసపూడి, కృత్తివెన్ను శివాలయం తదితర ఆలయాల్లో మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని అమ్మవార్లను సరస్వతీ దేవిగా అలంకరించారు. సరస్వతీ పూజలను చిన్నారులు వైభవంగా నిర్వహించారు.

కోడూరు: విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ అమ్మవారి ఆలయంలో సామూహిక కుంకుమార్చనను జరిపారు. మూలా నక్షత్రాన్ని పురస్కరించుకొని అమ్మవారిని సరస్వతీ దేవిగా అలంకరించారు. చిన్నారులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బంటుమిల్లి: స్థానిక కనక దుర్గాదేవీ ఆలయం, పాశ్చాపురం ఆంజనేయస్వామి ఆలయం, పెదతుమ్మిడి శివాలయంలో అమ్మవార్లను శ్రీసరస్వతీ దేవీగా అలంకరించారు. రామాలయం, వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో అమ్మవారిని శ్రీవిద్యాలక్ష్మీ దేవిగా అలంకరించి పూజలు చేశారు.

గూడూరు: గూడూరులోని శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయం, తరకటూరులోని శ్రీ అన్నపూర్ణా సమేత శ్రీ విశ్వేశ్వరస్వామి ఆలయం, ఐదుగుళ్లపల్లిలోని శ్రీ పార్వతీ సమేత శ్రీ సోమేశ్వరస్వామి ఆలయం, రామన్నపేటలోని శివాలయాల్లో అమ్మవారు సరస్వతీ దేవిగా దర్శనమిచ్చారు.

ఘంటసాల: ఘంటసాల గ్రామంలోని సత్రవు సెంటర్ రామాలయం వద్ద అమ్మవారు సరస్వతీ దేవిగా దర్శనమిచ్చారు. కార్యక్రమంలో పోతార్లంక వెంకటేశ్వరరావు మాష్టారు చిన్నారులకు పుస్తకాలు పంపిణీ చేశారు.

పెదకళ్లేపల్లి(మోపిదేవి): దక్షిణ కాశీగా పేరుగాంచిన పెదకళ్లేపల్లి శ్రీ దుర్గాపార్వతీ సమేత నాగేశ్వర స్వామివారి దేవస్థానంలో దుర్గమ్మ సరస్వతీ దేవిగా దర్శనమిచ్చారు. పూజా కార్యక్రమాల్లో స్థానిక శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ దంపతులు, యువనాయకులు మండలి వెంకట్రామ్ దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమాలను ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాద రావు పర్యవేక్షించారు.

పెడన: నందమూరు శ్రీవాసవీ ఇంజినీరింగ్ కళాశాలలో దసరా సంబరాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆధ్యాత్మిక వేత్త రాలు ఏలూరి కీర్తి ప్రశాంతి పాల్గొని మెకానికల్ లాబ్‌లో ఆయుధ పూజలను చేశారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి.



పెదతుమ్మిడి శివాలయంలో కుంకుమ పూజల్లో పాల్గొన్న చిన్నారులు



శ్రీరామపాదక్షేత్రంలో చిన్నారుల పూజలు



పెడన పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..



పెదకళ్లేపల్లిలో వేడుకల్లో ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్



వాసవీ కళాశాలలో దసరా వేడుకలు

వరద ప్రవాహంపై అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ డీకే బాలాజీ

మోపిదేవి, అవనిగడ్డ, చల్లపల్లి: కృష్ణానదికి పెరుగుతున్న వరద ప్రవాహంపై అధికారులు అప్రమత్తంగా ఉండి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. మోపిదేవి, అవనిగడ్డ, చల్లపల్లి మండలాల్లోని నదీ పరివాహక ప్రాంతాలైన బొబ్బర్లంక, కె.కొత్తపాలెం, మోపిదేవివార్పు గ్రామాల్లో ఆయన క్షేత్రస్థాయిలో సోమవారం పర్యటించారు. వరద ముంపు గ్రామాల ప్రజలతో ఆయన మాట్లాడుతూ.. వరద తీవ్రత పెరిగితే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు. ముంపునకు గురైన పంటలను పరిశీలిస్తూ ఎన్యూమరేషన్ చేపట్టాలని ఉద్యానశాఖ అధికారులకు సూచించారు. ఇరిగేషన్ శాఖ కేసీ డివిజన్ ఈఈ రవికిరణ్, స్థానిక తహసీల్దార్ ఎం.హరనాథ్, ఎంపీడీవో స్వర్ణభారతి, వ్యవసాయశాఖ అధికారులు మురళీకృష్ణ, కె.హెబ్సీబారాణీ, వైద్య సిబ్బంది, తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు. వరద మరింత పెరగకముందే సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ విజ్ఞప్తిచేశారు. ముంపు గ్రామాల్లో ఆయన పర్యటించి గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. కె.కొత్తపాలెం గ్రామ సర్పంచ్ కొక్కిలిగడ్డ మాధవి, నీటి సంఘం అధ్యక్షులు మత్తి నాగమల్లేశ్వరావు, మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యులు చందన రంగారావు, పూషడపు రత్నగోపాల్, మత్తి వంశీకృష్ణ, కోనేరు నాగేశ్వరావు, కేశాని శివుడు, బుల్లిబాబు, పంచాయతీ కార్యదర్శి చందన లీలావసుందర, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



బొబ్బర్లంక వద్ద వరదను పరిశీలిస్తున్న బాలాజీ

పులిగడ్డ అక్విడెక్టు పైనుంచి వరద



పులిగడ్డ అక్విడెక్టు పైనుంచి ప్రవహిస్తున్న వరద



దక్షిణ చిరువోలు లంకలోని పంట పొలాల్లో వరద

అవనిగడ్డ: వరద ఉధృతి పెరడగంతో నదీ ప్రాంత ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. బందలాయిచెరువు, గుడివాకవారిపాలెం, పులిగడ్డలో పంట పొలాల్లోకి వరద రావడంతో పలు వాణిజ్య పంటలు నీట మునిగాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పులిగడ్డ అక్విడెక్టు పైనుంచి వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో అక్విడెక్టు సైడ్ డ్రిల్స్ కిందకు దించేశారు. తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, ఎంపీపీ తుంగల సుమతీదేవి, ఎంపీడీవో మరియాదేవి, ఆర్ఐ బాలాజీ ముంపు ప్రాంతాలను పరిశీలించారు. దక్షిణ చిరువోలు లంకలో పంట పొలాలను వరద ముంచెత్తింది. పొలంలో మోకాలు లోతు నీరు చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

నాగాయలంక: దిగువునకు వరద నీరు విడుదల చేయడంతో కృష్ణా బ్యాక్‌వాటర్ ప్రాంతమైన నాగాయలంక శ్రీరామపాద క్షేత్రం పుష్కర ఘాట్‌లో సోమవారం సాయంత్రానికి వరద ప్రవాహం 10 అడుగులకు చేరింది. దీంతో ఘాట్‌లోని వాటర్ స్పోర్ట్స్ బోట్స్ షెడ్ కేంద్రం, పర్యాటక శాఖ ఫుడ్‌కోర్టు లోకి వరద చేరింది. అత్యవసరాలకు తహసీల్దార్ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలని తహసీల్దార్ సీహెచ్‌వీ ఆంజనేయప్రసాద్ పేర్కొన్నారు.

శ్రీకాకుళం(ఘంటసాల): వరద ఉధృతి తగ్గే వరకు ప్రజలతో పాటు అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఘంటసాల మండల తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ అన్నారు. శ్రీకాకుళం, పాపవినాశనం గ్రామాల్లో ఆయన ముంపు ప్రాంతాలను సోమవారం పరిశీలించారు. రైతులు, కూలీలు ఎవరూ నదిలోకి వెళ్లకూడదని తహసీల్దార్ విజయ ప్రసాద్ తెలిపారు. ప్రజలు అధికారులకు సహకరించాలని కోరారు.

నీట మునిగిన పంట పొలాలు

చల్లపల్లి: కృష్ణానదిలో పెరిగిన వరద ఉధృతికి కరకట్ట దిగువున ఉన్న వాణిజ్య, మెట్ట పంటలు ముంపునకు గురయ్యాయి. నడకుదురు, నిమ్మగడ్డ, నాదెళ్లవారిపాలెం, రాముడుపాలెం ప్రాంతాల్లోని కరకట్టకు దిగువున సాగుచేస్తున్న పంటలను వరద ముంచెత్తింది. మండల పరిధిలో సుమారు 300 ఎకరాల పంటలు నీట మునిగినట్లు రైతులు చెపుతున్నారు.

శ్రీపృథ్వీశ్వరస్వామి ఆలయంలోకి వరద..

నడకుదురులో కొలువైన శ్రీపృథ్వీశ్వరస్వామి వారి ఆలయ పరివాహక ప్రాంతం సోమవారం వరద నీటితో నిండిపోయింది.


డయేరియా ప్రాంతాల్లో పర్యటన



సాక్షి ఎఫెక్ట్


అవనిగడ్డ: అవనిగడ్డలోని 8, 9 వార్డుల్లో డయేరియా ప్రాంతాలకు అధికార యంత్రాంగం కదలివచ్చింది. గత మూడు రోజుల నుంచి డయేరియా సోకడం వల్ల పలుచోట్ల చికిత్స పొందుతున్న రోగుల గురించి సాక్షిలో 'అవనిగడ్డలో డయేరియా కలకలం' శీర్షికను ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన డీఎంహెచ్‌వో ఎ.వెంకట్రావ్, ఐడీఎస్‌పీ రాష్ట్ర అధికారిణి డాక్టర్ పద్మజ, డీసీహెచ్ శేషుకుమారి పలువురు అధికారులు, వైద్య సిబ్బందితో తరలి వచ్చారు. 8, 9 వార్డుల్లో పర్యటించి డయేరియా కేసుల గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. 8వ వార్డులో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్యశిబిరాన్ని సందర్శించారు. డాక్టర్ రాహుల్ ప్రభాకర్, డాక్టర్ మహేష్‌తో మాట్లాడుతూ.. వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ రాహుల్ ప్రభాకర్, సూపర్‌వైజర్ కేటీ రామారావుతో పాటు సిబ్బంది ఇంటింటా తిరిగి సర్వే నిర్వహించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ సోమశేఖర్, డీఎల్‌పీవో రసావుల్లా 8, 9 వార్డులో పంచాయతీ సరఫరా చేస్తున్న తాగునీటిని, ఆయా ప్రాంతాల్లోని ఆర్వో ప్లాంట్ల నుంచి సరఫరా చేస్తున్న తాగునీటిని పరిశీలించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి పి.సాయిబాబు, ఎంపీడీవో మరియాదేవి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సందడిగా మురళీ కోలాటం పోటీలు



చిట్టూర్పు(ఘంటసాల): ఘంటసాల మండలం చిట్టూర్పు గ్రామంలోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం ప్రాంగణంలో జరుగుతున్న జిల్లాల స్థాయి మురళీ కోలాటం పోటీలు సోమవారం సందడిగా సాగాయి. ఈ సందర్భంగా కొక్కిలిగడ్డకు చెందిన శ్రీ ముద్దుల మురళీ కృష్ణ కోలాట బృందం కోలాటం చేయగా, మల్లంపల్లి గ్రామానికి చెందిన జి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థినీలు ప్రదర్శించిన కర్రసాము ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తాళం భజన పోటీలు కూడా కొనసాగుతున్నాయి. కొడాలి పీఏసీఎస్ చైర్‌పర్సన్ గుత్తికొండ ప్రసాద్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా పడుగు ప్రభాకర్, పి.శ్రీనివాసరావులు వ్యవహరించారు. కార్యక్రమంలో దాసరి సతీష్, యలవర్తి వంశీ, వేములపల్లి సుధీర్, పరుచూరి వెంకటేశ్వర రావు, వాకా రాకేష్, గుత్తికొండ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకూ పోరాడుతాం



మచిలీపట్నం టౌన్: తమ సమస్యలను పరిష్కరించేంత వరకూ పోరాటాన్ని ఆపే ప్రసక్తి లేదని గ్రామ, వార్డు సచివాలయాల కార్యదర్శుల సంఘ జేఏసీ నాయకులు హెచ్చరించారు. రాష్ట్ర గ్రామ, వార్డు సచివాలయ జేఏసీ పిలుపు మేరకు మచిలీపట్నం నియోజకవర్గంలోని సచివాలయ కార్యదర్శులు సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. నాయకులు మాట్లాడుతూ.. సమస్యలలో ప్రధానమైనది సచివాలయ ఉద్యోగులు డోర్ టు డోర్ సర్వే చేయడం తమ ఆత్మగౌరవాన్ని కించపరచడమేనన్నారు. వాలంటీర్ విధుల నుంచి తమకు విముక్తి కలిగించాలని ప్రధానంగా డిమాండ్ చేశారు. అక్టోబరు 5వ తేదీన విజయవాడలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభిస్తామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో జేఏసీ జిల్లా కన్వీనర్ గోపీచంద్, మచిలీపట్నం నాయకులు పువ్వుల కిరణ్‌కుమార్, పండు, నియోజకవర్గంలోని గ్రామ, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.





